ప్రజాశక్తి

శుక్రవారం 6 జూన్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

మెగా డిఎస్‌సి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 11 పరీక్షా కేంద్రాలు
- 10 మంది ప్రత్యేకాధికారులు
- నేటి నుండి 30 వరకు పరీక్షల నిర్వహణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 6 నుండి 30వ తేదీ వరకు జరిగే మెగా డీఎస్సీ - కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సీబీటీ)ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ గురువారం పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఏర్పాట్లపై సమీక్షించారు. దిశానిర్దేశం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లాకు తెలంగాణలో ఒక కేంద్రంతోపాటు మొత్తం 11 కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. సెషన్ - 1కు 16,964 మంది, సెషన్ - 2కు 15,287 మంది అభ్యర్థులను కేటాయించినట్లు వివరించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను, 10 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టబందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాలవద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం వివిధ మార్గాల్లో ప్రత్యేకంగా బస్సులు నడపాలని ప్రజా రవాణా శాఖ అధికారులకు సూచించారు. హాల్‌టికెట్‌లో ఏవైనా తప్పులు ఉంటే ధ్రువీకరణ పత్రాల ఆధారంగా కేంద్రాల వద్ద సరిదిద్ది పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. అభ్యర్థులు సందేహాల నివత్తికి, సహాయానికి కంట్రోల్ రూమ్ నంబర్ల (79814 56441, 94405 06411)లో సంప్రదించవచ్చన్నారు. ఈసమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎంహెచ్‌వో

(మిగతా 2లో)

పర్యాటక కేంద్రంగా మంగినపూడి బీచ్

- మసులా బీచ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్
- అట్టహాసంగా ఫెస్టివల్ ప్రారంభం

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : మసులా బీచ్ ఫెస్టివల్‌తో బందరు కొత్త రూపు సంతరించుకుందని, త్వరలో ఈ ప్రాంతాన్ని అద్భుత పర్యాటక కేంద్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కష్ణాజిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి సముద్రతీరంలో మసులా బీచ్ ఫెస్టివల్ -2025ను ఎక్సైజ్ శాఖ మంత్రి, స్థానిక శాసనసభ్యులు మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ అట్టహాసంగా ప్రారంభించారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, కష్ణా జిల్లా అధికార యంత్రాంగం సంయుక్తంగా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మళ్లీ కళా, సాంస్కృతిక వైభవం వెలుగొందేలా 'మసులా బీచ్ ఫెస్టివల్ - 2025'కు చేసిన ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారు. అంతేగాక అమరావతి ఐకానిక్ టవర్, అసెంబ్లీ ఆకారంలో తయారు చేసిన ముఖద్వారం (గేట్ వే ఆఫ్ అమరావతి) ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. వివిధ సముద్ర జీవుల్ని పోలిన ఆకారాలు, కయాకింగ్, కనోయింగ్ వంటి జలక్రీడలు, పారా గ్లైడింగ్ తదితర గేమ్స్ సందర్శకులను ఆకర్షించేలా ఏర్పాటు చేశారన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అఖండ గోదావరి, గండికోటల పర్యాటక ప్రాజెక్టులను చేపట్టామని మంత్రి దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని



బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర

చారిత్రాత్మక హేవలాక్ వంతెనను ఆధునికీకరించి అద్భుతంగా తీర్చిదిద్దనున్నామన్నారు. సూర్యలంక బీచ్‌ను రూ.97 కోట్లతో అభివద్ధి చేయనున్నామన్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర షింగ్ షెకావత్ రాష్ట్రానికి మరిన్ని పర్యాటక ప్రాజెక్టులను కేటాయించేందుకు సుముఖంగా ఉన్నారన్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధం చేయాలని కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీసీబీ చైర్మన్ రామకష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, కలెక్టర్ డికె.బాలాజీ, ఎస్పీ అర్.గంగాధరరావు, అధికారులు పాల్గొన్నారు.

రేపు "అమరావతి రాజధాని - నిధులు - నిర్మాణం - విధానాలు"పై సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ : "అమరావతి రాజధాని - నిధులు - నిర్మాణం - విధానాలు" అంశంపై ఈనెల 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు విజయవాడ బాలోత్సవ భవన్ 2వ అంతస్తులో సదస్సు జరుగుతుందని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం మేనేజ్మెంట్ కమిటీ తెలిపింది. ఈ సదస్సులో సెస్మాజీ ప్రొఫెసర్ డాక్టర్ సి.రామచంద్రయ్య, మాజీ మంత్రి, ప్రముఖ రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం బాధ్యులు బి.గంగారావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మస్తాన్వలి, ఎంబివికె చైర్మన్ పి.మధు ౦ పాల్గొంటారని తెలిపింది.

కెడిసిసిబి చైర్మన్‌గా నెట్టెం బాధ్యతలు

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా మాజీమంత్రి, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షుడు నెట్టెం రఘురాం గురువారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ కార్యక్రమంలో జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తోపాటు ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, ఎమ్మెల్యేలు శ్రీరాం

(మిగతా 2లో)



నెట్టెంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపి శివనాథ్

రేషన్ కష్టాలు మొదలు

- మొరాయిస్తున్న సర్వర్లు
- అసహనంలో కార్డుదారులు

ప్రజాశక్తి - గన్నవరం : రేషన్ కోసం బియ్యం కార్డుదారులకు తిరుగుడు కష్టాలు మళ్లీ మొదలయ్యాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం వాహనాల ద్వారా లోకేషన్‌కు సరుకులు తీసుకొచ్చి పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం ఇటీవల పంపిణీ వాహనాలు (ఎండీయూ) రద్దు చేసింది. ఈ నేపథ్యంలో తాము రేషన్ షాపులకు వెళ్లి క్యూలో గంటల తరబడి నిలబడి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని మహిళలు వాపోతున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకే సర్వర్ ఆగిపోవడంతో జనాలు డిపోల వద్ద నిలబడి ఎండ తాకిడికి వెళ్లిపోయారు. సాయంత్రం 6 గంటలకు రావాలని డీలర్లు చెప్పి పంపేశారు. ఎప్పుడు సర్వర్ పనిచేస్తుందో? ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి ఉందని అంటున్నారు. ఉదయం ఉపాధి పనులకు వెళ్లిన వారు తిరిగి 12 గంటలకు ఇళ్లకు వస్తారు. ఆ సమయానికి డిపో మూసివేస్తారు. వారు బియ్యం తీసుకునే అవకాశం ఉండదు. సాయంత్రం వెడితే సర్వర్ వస్తుందో రాదో తెలియటం లేదని మహిళలు అంటున్నారు. దీనికితోడు రేషన్ వద్దనుకుంటే డబ్బులు వేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పడంతో ఆవిధంగా చేస్తే రేషన్ కార్డులు పోతాయని భయం జనంలో నెలకొని ఉంది. ప్రభుత్వం వాహనాలు రద్దు చేయడం, రేషన్‌కు బదులు డబ్బులు ఇస్తామని చెప్పడం వెనుక ప్రజా పంపిణీ వ్యవస్థను లేకుండా చేయడం అనే కుట్ర దాగి ఉందని పలువురు భావిస్తున్నారు. వివరాలను పరిశీలిస్తే... గన్నవరం మండలంలో 49, ఉంగుటూరు మండలంలో 40 బాపులపాడు మండలంలో 51 మొత్తం 140 రేషన్ డిపోలున్నాయి.



రేషన్ డిపో వద్ద క్యూలైన్లో కార్డుదారులు

ప్రతినెలా గన్నవరం ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి బియ్యం, పంచదార సరఫరా జరుగుతోంది. తెల్లరేషన్ కార్డులు 73,201, అంత్యోదయ కార్డులు 4,156 ఉన్నాయి. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బియ్యం కార్డుదారులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేసేవిధంగా చర్యలు చేపట్టారు. దీంతో మండల పరిధిలో 41 ఎండియు వాహనాలు ఏర్పాటు చేసి ఇంటింటికీ వచ్చి రేషన్ పంపిణీ చేశారు. ప్రతినెలా 850 టన్నుల బియ్యం సకాలంలో పంపిణీ చేసేవారు. ఇళ్ల వద్దకు వాహనం రావడంతో వినియోగదారులు కాసేపు నిలబడి రేషన్ తీసుకుని వెళ్లేవారు. ఇది ప్రయోజనకరంగా ఉందని అనేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల వద్దకే వెళ్లాలని చెప్పడంతో జనం కష్టాలు మొదలయ్యాయని అంటున్నారు. రేషన్ కోసం వెళితే గంటల తరబడి

(మిగతా 2లో)

క్రమశిక్షణకు మారుపేరు

- నవత ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థాపకులు కోటేశ్వరరావుకు పలువురు నివాళి
- నేడు అంత్యక్రియలు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగర ప్రముఖులు, అభ్యుదయ, ప్రజాస్వామ్య, వామపక్ష వాది, నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరు పర్వతనేని వెంకట కోటేశ్వరరావు (82) మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. గత కొద్దికాలంగా వృధాప్యంతో వచ్చిన అనారోగ్యం సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. కోటేశ్వరరావు ఆటో మొబైల్, రవాణా రంగాలకు మార్గదర్శకులుగా ఉన్నారు. ముఖ్యంగా సరుకు రవాణా రంగంలో పేరుగాంచారు. అత్యంత క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ట్రాన్స్‌పోర్టు సమయంలో సరుకు రవాణా తప్పించి తమ వాహనాల్లో డ్రైవర్‌తోపాటు ప్రయాణికులు ప్రయాణించేందుకు అనుమతించే వారు కాదు. దూరదష్టితో వ్యవహరిస్తూ ఆటో రంగంలో నిపుణులుగా నిలిచారు. ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్, ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, విజయవాడ ఆటోనగర్ పెద్దల కమిటీ, ఆటోనగర్ ఐలా ఎన్నికల సమయంలో ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక జరిగేలా ప్రయత్నించేవారు. సుమారు 100 ఎకరాల్లో వాహన డ్రైవర్లకు డ్రైవింగ్ స్కూలు ఏర్పాటు చేశారు. నిపుణులతో శిక్షణా తరగతులను నిర్వహించేవారు. పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. హెవీ వెహికల్స్‌కు రోడ్ కం సిగ్నలింగ్ సిస్టంతో నందిగామ ప్రాంతంలో రోడ్ ట్రైనింగ్ సదుపాయం సమకూర్చారు. తమ డ్రైవర్లకు హాస్టల్ వసతి, మంచి ఆహారం సమకూర్చేవారు. డ్రైవర్లను అత్యంత బాధ్యతతో చూసేవారు. సంస్థ ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ వారి సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు నిర్వహించారు. నవత ట్రాన్స్‌పోర్టు విస్తరణకు, అభివద్ధికి విశేషంగా కృషి చేశారు. విజయవాడ కృష్ణలంకలోని ఆధునిక స్వర్గపురి నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు. దాని

(మిగతా 2లో)

60 మంది వాహనదారులకు జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 60 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులను గురువారం ఆరో అడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 60 మందిలో 12 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 48 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. మొత్తం 60 మందికి రూ.6.60 లక్షల వరకు జరిమానా విధించారు.

హరితాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములుకండి

జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కషిచేస్తున్నాయని వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం శాఖల మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం -2025 కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి వద్ద నగరవనం వద్ద మంత్రి సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీశ మొక్కలను నాటారు. అనంతరం మంత్రి



మొక్క నాటుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్

మాట్లాడుతూ మొక్కలు నాటుదాం.... పర్యావరణాన్ని కాపాడుదాం... అనే వినాదంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈకార్యక్రమంలో విజయవాడ ఆర్డిఓ కావూరి చైతన్య, జిల్లా అటవీ శాఖ అధికారి జి. సతీష్ పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలి : మంత్రి సవిత

ప్రజాశక్తి - కంకిపాడు :కృష్ణాజిల్లా తాడిగడప మున్సిపాలిటీ, పోరంకి పరిధిలోని 100 అడుగుల అనుమోలు గార్డెన్స్ ఎదురు గల రోడ్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పెనమలూరు ఎంఎల్ఎ బోడే ప్రసాద్ ఆదేశాల అనుసారం పెనమలూరు నియోజకవర్గ యువ నాయకులు బోడే వెంకట్ రామ్ అధ్యక్షతన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, తాడిగడప పట్టణ జనసేన అధ్యక్షులు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్ పాల్గొన్నారు.



గ్రీన్ ఎనర్జీలో పెట్టుబడులు పెరగాలి

పర్యావరణ సదస్సులో డాక్టర్ జి అనిత

ప్రజాశక్తి - విజయవాడ : ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యం లో విజయవాడ ప్రెస్ క్లబ్ లో పర్యావరణ దినోత్సవం సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది.ఆ సంస్థ ఫౌండర్ సిచ్ భద్ర పిలుపు మేరకు సుమారు ఏడు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సమావేశానికి ఆ సంస్థ ఎపి రాష్ట్ర అధ్యక్షుడు బి ఎస్ భార్గవ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ జి అనిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2047 కల్లా స్వర్ణాంధ్రప్రదేశ్ గా రూపాంతరం చెందాలని దానికి అందరం కట్టుబడి పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు.గ్రీన్ ఎనర్జీ లో పెట్టుబడులు పెట్టాలని ఆమె కోరారు అంతేకాకుండా ఎప్పుడైతే పర్యావరణం ఆధారంగా వత్తులు పెరుగుతాయో దాని ద్వారా ప్రజలు ఆధారపడి బతుకుతారో అప్పుడు ప్రజలు పర్యావరణాన్ని కాపాడుకుంటారని ఆమె తెలిపారు.పర్యావరణ హితమైన వ్యవసాయ ఉత్పత్తులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ జి.అనిత, చిత్రంలో బి.ఎస్.భార్గవ్

వ్యాపారంగా మారి ఉపాధి గా మారితే రాష్ట్ర ఆదాయం అభివద్ధి చెంది చాలామంది జీవితాలు మార్పు చెందుతాయని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బి ఎస్ భార్గవ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరియు రాజధాని అమరావతి ఆంధ్రుల గుండె చప్పుడని ఈ రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచేందుకు ప్రపంచ పర్యావరణ సంస్థ కషి చేస్తుందని తెలిపారు.అంతేకాకుండా అటవీ ఉత్పత్తులు వాటి మీద ఆధారపడి బతుకున్నవాళ్ళు రాజధాని లిమిట్స్ లో చాలామంది ఉన్నారని వీరికి తగిన గుర్తింపు రావటంలేదని ఆవేదన వ్యక్తం చేసారు ఉదాహరణకు కొండపల్లి బొమ్మలు అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్నా దానికి ఉపయోగించే పొనికి చెక్క మాత్రం కనుమరుగవుతుందని దీనిని మనం కాపాడుకోవాలని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ వెంకట్ కొల్లూరి మాట్లాడుతూ మానవ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయటం లో తీవ్ర స్థాయిలో వైఫల్యం ఉందని దీని వెంటనే నివారించాలన్నారు మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కాళహస్తి నల్లిబోయిన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం లో యువత ప్రధాన పాత్ర పోషించాలని కాలుష్యాన్ని తగ్గించే రవాణా సాధనాలు వినియోగించాలని సోలార్ ఎలక్ట్రిక్ వైపు యువత అడుగులు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ సభ్యులు రాష్ట్ర ఎన్జీఓ నాయకులు నాళం మురళీ కష్ణ, నాయకులు ఉమామహేశ్వరి, కవితాలక్ష్మి, అనూషా, కొండయ్య, బాలాజీ, ఫణేంద్ర,రాజేష్,రమ్య తదితురులు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటికి పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆలపాటి సురేశ్ కుమార్‌ను పలు జర్నలిస్టు సంఘాల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి ఛైర్మన్ శ్రీనివాస రెడ్డి, ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపియుడబ్ల్యుజె నేతలు, ఇతర జర్నలిస్టు సంఘాల నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్, హిందూ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డప్ప, సమాచార శాఖ అదనపు పిఎస్ డాక్టర్ అనిత, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్. స్వర్ణ లత, జాయింట్ డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, విశ్రాంత అడిషనల్ డైరక్టర్ దాసరి శ్రీనివాస్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఎన్‌టిఆర్ జిల్లా



ఆలపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు జి.ఆంజనేయులు, ఎస్.వెంకట్రావు, కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, కొండబాబు

అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, నాయకులు కొండబాబు, బాషా, ఎపిఎంపిఎ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, ఉపాధ్యక్షుడు యేమినేని వెంకట రమణ, రాష్ట్ర కార్యదర్శి మత్తి శ్రీకాంత్, విజయవాడ సిటీ అధ్యక్షుడు తుళ్లూరి అనిల్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు విజయ్ బాబు తదితరులు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మీడియా అకాడమి సెక్రటరీ మణిరాం నూతన ఛైర్మన్ కు స్వాగతం పలికారు. అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి బుద్ధ ప్రసాద్ ఛైర్మన్ సురేష్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు.



ఆలపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎపిఎంపిఎ నాయకులు వీర్ల శ్రీరామ్ యాదవ్, వై.వెంకట రమణ తదితరులు

మొదటిపేజీ తరువాయి

మెగా డిఎస్‌సి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

డా. ఎం.సుహాసిని, డీసీపీ కేజీవీ సరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **పరీక్ష కేంద్రాలు:** అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాల (అనంతగిరి, కోదాడ మండలం, నల్గొండ జిల్లా), శ్రీ వాహిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (తిరువూరు), లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ (మైలవరం)తోపాటు విజయవాడలో అయాన్ డిజిటల్ జోన్ - కండ్రిక, పీఎస్-సీఎంఆర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్‌వీటీ ఇన్ఫోటెక్-గవర్నర్‌పేట, లైఫ్ బ్రిడ్జ్ ఇన్ఫో టెక్నాలజీస్- గొల్లపూడి, ఎస్ఆర్‌కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్నారై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీలక్ష్మి కంప్యూటర్స్-గొల్లపూడి, శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ - కానూరు.

కెడిసిసిబి చైర్మన్‌గా నెట్టెం బాధ్యతలు

రాజగోపాల్, కొలికపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముందుగా నగరంలోని కెడిసిసిబి కార్యాలయంలో నెట్టెంను ఎంపి శివనాథ్, స్వఛ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నెట్టెంకు కెడిసిసిబి చైర్మన్ పదవి అలంకారం మాత్రమేనని, ఆయన గతంలోనే పలు ఉన్నత పదవులు అలకరించారని అన్నారు. తన అనుభవంతో బ్యాంక్‌ను మరింత అభివృద్ధిలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు

చైర్మన్‌గా నిధుల సమీకరణకు కృషి చేశారు. తన సోదరుడైన కీర్తిశేషులు పర్వతనేని సుభాష్ చంద్రబోస్ పట్ల అమితమైన గౌరవం కలిగి ఉండేవారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక బాధ్యత కలిగి ఉండేవారు. నీతి నిజాయితీలతో సంస్థను నడిపారు.

పలువురు నివాళులు

కోటేశ్వరరావు భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. నవత ట్రాన్స్‌పోర్టు వ్యవస్థాపకులుగా ఉన్న కోటేశ్వరరావు, ఆయన సోదరుడు పర్వతనేని సుభాస్ చంద్రబోస్ క్రమ శిక్షణకు మారు పేరుగా ఉండేవారని గుర్తుచేశారు. అలాగే ఎపిఎంఎస్ఎంఇ ఇండియన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బాయన వెంకటరావు సంతాపం తెలిపారు. ఇంకా పలువురు నగర ప్రముకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

నేడు అంత్య క్రియలు

పర్వతనేని వెంకట కోటేశ్వరరావు అంత్య క్రియలు శుక్రవారం ఉదయం జరుగుతాయని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. క్రీస్తురాజపురంలోని స్వగహం నుండి ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర బయలుదేరుతుందని తెలిపారు. స్వర్గపురిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేషన్ కష్టాలు మొదలు

నిలబడడం, సర్వర్ పని చేయడం లేదని చెప్పడంతో మండిపడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం సరికాదు
సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు

రేషన్ పంపిణీలో నగదు బదిలీని ప్రవేశపెట్టి ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది సరికాదు. షాపులకు వెళ్లి రేషన్ తీసుకునేందుకు వెళ్లిన వారు గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. సర్వర్ సమస్యలు పెరిగిపోయాయి. డిపోలో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు, ఆయిల్, ఇతర సరుకుల పంపిణీ కూడా జరిగేలా చూడాలి.

ఇళ్ల వద్ద పంపిణీ జరగడంలేదు : బాజీ, వికలాంగుడు

వద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దే రేషన్ ఇస్తారని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆచరణలో అమలు జరిగేలా కనిపించడం లేదు. రేషన్ వాహనాలు ఉంటేనే ఇళ్ల వద్దకు వచ్చి ఇచ్చేవారు. వాహనాల ద్వారా బియ్యం పంపిణీ నిలిపివేయడం సరికాదు.

ప్రభుత్వం పునరాలోచించాలి : ఐద్వా నాయకురాలు లక్ష్మి

సక్రమంగా రేషన్ ఇస్తారా లేదా అని వద్ధులు ఆందోళన చెందుతున్నారు. రేషన్ పంపిణీ విధానం అగమ్యగోచరంగా తయారైంది. కార్డుదారుల్లో అసంతప్తి వ్యక్తమవుతోంది. అందువల్ల ప్రభుత్వం పునరాలోచించి ఇళ్ల వద్దకే రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలి. వద్ధులు, వికలాంగుల ఇంటి వద్దకే సరుకులు చేర్చాలి. డిపోల వద్ద నిలబడేందుకు వీలుగా షామియానాలతోపాటు తాగడానికి మంచినీటి సదుపాయం కల్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

● ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల మొక్కలు నాటి ప్రతిజ్ఞలు



అవనిగడ్డ మండలంలో...

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందరద్భంగా కృష్ణాజిల్లాలో పలుచోట్ల మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి నాయకులు మొక్కలు నాటారు.

ప్రజాశక్తి-గన్నవరం : యన్‌టిఆర్ పశు వైద్య కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏక్ పేడ్ మా కె నామ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.వి.యస్. కిషోర్ పాల్గొన్నారు. కళాశాల ఆవరణంలో విద్యార్థులు , అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ కిషోర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రమం తప్పకుండా చెట్లను నాటాలని, నాటిన తర్వాత మొక్కలను పరిరక్షించాలని బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. టి. శ్రీనివాసరావు, డా. బిందు కిరణ్మయి, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : పమిడిముక్కల మండలం లోని లంకపల్లి, శ్రీరంగాపురం తదితర గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఓ సీతారామరాజు, వెంకటేశ్వర ప్రసాద బాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి -నందివాడ** : ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవం కార్యక్రమం నందివాడ మండలంలోని నందివాడ గ్రామంలో నిర్వహించారు. భాష, సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి , పంచాయతీ కార్యదర్శి కె.సురేష్ బాబు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు తాసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించి మొక్కలు నాటారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గుడివాడ శేషబాబు, జిల్లా సొసైటీ ఎక్స్ వైస్ చైర్మన్ డాక్టర్ వంగర శేషగిరిరావు, మండల వైస్ చైర్మన్ గరికపాటి హరిప్రసాద్ పాల్గొన్నారు. మండల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ పి లంకమ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో మొక్కలు నాటారు. ఉపసర్పంచ్ ఎప్పటి నాగరాజు గ్రామ కార్యదర్శి జాహ్నవి, తుంగల వెంకటేశ్వరరావు, పనికి ఆహార పథకం సభ్యులు పాల్గొన్నారు. కాగా పులిగడ్డ గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బి అనిత, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు మొక్కలు నాటారు. వార్డు సభ్యులు మండలి విజయలక్ష్మి ఇంజనీర్ అసిస్టెంట్ భార్గవ్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తుట్టగుంట సర్పంచ్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తుట్టగుంట గ్రామంలో సర్పంచ్ బొమ్మరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఉపసర్పంచ్ చింతలపూడి నాగభూషణం, గ్రామ పెద్దలు పిల్లి రాజారావు, బొమ్మరెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి** : వక్షాల సంరక్షణ, వాల్టా చట్టం అమలుతోనే పర్యావరణ పరిరక్షణ దినోత్సవ లక్ష్యం నెరవేరు తుందని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం మోపిదేవి వార్పు వద్ద "ఐ లవ్ దివిసీమ" బోర్డు ప్రారంభించి, ఉద్యానవనంలో మొక్కలు నాటారు. పులిగడ్డ ఆక్విడెక్టు మోపిదేవి వార్పు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండలి యుగంధర్ ఆర్థిక సహకారం రూ.40వేలతో ఈ ఉద్యానవనంలో అశోక, బ్లాక్ పాండా, రెడ్ మిర్చి, స్టెప్ ట్రీ, ఫోస్టయిన్ మొక్కలు నాటారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాధ్ ప్రసాద్, ఇరిగేషన్ శాఖ డీఈఈ ఎస్.అరుంధతి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్)** : బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామంలో గురువారం 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయటం" అనే నినాదంతో ప్లేకార్డు ప్రదర్శించి ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025 ప్రాముఖ్యతను స్థానిక నాయకులు వివరించారు. నాగర్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపిటిసి సభ్యులు పుసులూరు లక్ష్మీ నారాయణ తదితరులు వీరవల్లి రంగన్న గూడెం ఆర్.అండ్.బి. రహదారి గ్రామం లోని ప్రధాన రహదారుల పక్కన 100 మొక్కలను నాటారు. **ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్** : పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఈడేపల్లి గ్రంధాలయం ప్రాంగణంలో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. 2029 నాటికి మచిలీపట్నాన్ని గ్రీన్ సిటీ గా తీర్చిదిద్దేందుకు సహాయ ఫౌండేషన్ కషి చేస్తుందని అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ భాషా అన్నారు. జూన్ నెలాఖరు నాటికి 40 వేలం నుంచి 60 వేల మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. కోన వెంకటేశ్వరమ్మ, సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ భాషా పాల్గొన్నారు.

ఆకుపచ్చని గన్నవరం లక్ష్యం : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : నియోజకవర్గంలో పచ్చదనం పెంపొందించేదుకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్లో గురువారం ఉదయం మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని యార్లగడ్డ ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై గన్నవరం నియోజ వర్గంలోని గ్రామాలతోపాటు నియోజకవర్గం ప్రారంభ గ్రామమైన రామవరపాడు నుంచి చివరి గ్రామమైన బొమ్మలూరు వరకు పచ్చదనాన్ని పెంపొంది స్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే బాపులపాడు లో మొక్కలు నాటామని, గన్నవరంలోనూ మొక్కలు నాటుతున్నామని, మరో 10 రోజుల్లోనూ రామవర పాడులోనూ మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని వివరించారు. . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, బిజెపి నాయకులు చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్, టిడిపి నాయకులు దొంతు చిన్న, ఆళ్ల గోపాలకష్ణ, మద్దినేని వెంకటేశ్వరరావు, కొమ్మరాజు సుధీర్, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జిఇసి లో సివిల్ ఇంజనీర్ డిపార్ట్మెంట్ గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పర్యావరణాన్ని కాపాడాలని ప్రిన్సిపల్ డాక్టర్ బి కరుణ కుమార్ కోరారు. గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయం వద్ద ఏవో ఇమ్రాన్, డీటీలు మొక్కలు నాటారు. అలాగే వడ్లమన్నాడు పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి వెంకటరమణ, జెల్ నరసింహారావు, ఎలిషారు, విజయ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు:** ఉయ్యూరు 20వ వార్డులో జరిగిన కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ వి.సత్య నారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, ఉద్యోగులు మొక్కలు నాటారు. కేసీపీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కర్మాగార ఆవరణలో పర్యావరణ దినోత్సవం నిర్వహించి, కార్మికులు, ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. యూనిట్ హెడ్ సీతా రామదాస్, ఉద్యోగులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు. కడవకొల్లులో ఎంపీడీవో శేషగిరిరావు, డీ ల్ పి ఓ రాజేశ్, కోటేశ్వరరావు మొక్కలు నాటారు. **ప్రజాశక్తి-కోడూరు** : కోడూరులో పలు ప్రాంతాలలో గ్రామ సర్పంచ్ వెన్నా షైనీ పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు, జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులచే పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీటీసీ బడే గంగాధర్ రావు, తిమ్మన నాంచారయ్య సచివాలయ ఉద్యోగులు, ఎనర్జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి మొవ్వ:** కూచిపూడి సచివాలయ పరిధిలోని కార్యాలయాల ప్రాంగణంలో ఉయ్యూరు ఆర్డిఓ బిఎస్ హెలాషారోన్ మొక్కలు నాటారు. ఆర్డీవోతో పాటు తాసిల్దార్ కే మస్తాన్, ఎంపీడీవో జి విమాదేవి, డిప్యూటీ తాసిల్దార్ సిహెచ్ రఘురాం, ఆర్ ఐ కె విజయ దుర్గ, సచివాలయ సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల** : మండల పరిధిలోని కొడాలిలో పంచాయితీ కార్యదర్శి సిహెచ్ విఎస్. నాగమణి ఆధ్వర్యంలో మొక్కలు నాటి గ్రామస్తులచే ప్రతిజ్ఞ నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచ్ తుమ్మల శంకర్ రావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు కంఠమనేని రాజగోపాల్, గ్రామస్తులు గుమ్మడి నాగభూషణం పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి** : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కోనేరు చుట్టూ గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వనం - మనం కార్యక్రమంలో భాగంగా చెట్ల పెంపకం లో భాగంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వాణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు మొక్కలు నాటారు .ఈ కార్యక్రమంలో ఆలయ సూపరెంటెంట్ అచ్యుత మధుసూదన్ రావు, ఆలయ సిబ్బంది బర్మ ప్రసాద్, తిమ్మన రామకష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డివో బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌లు మొక్కలను నాటారు. గురువారం రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల వద్ద హరిత ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించి మొక్కలు నాటారు. రెవెన్యూ ఏఓ బాలాజీ, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరావు, సిబ్బంది, పాల్గొన్నారు.



మొవ్వ మండలంలో...



నందివాడ మండలంలో..

మొక్కలను బాధ్యతగా పెంచాలి
కెయు రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మొక్కలను నాటి వదిలేస్తే సరిపోదని, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకున్నపుడే ఫలితాలు ఉంటాయని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు స్పష్టం చేశారు. వన మహోత్సవం సందర్భంగా గురువారం విశ్వవిద్యాలయం ఆవరణలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమం ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం లో బోధన, బోధనేతర సిబ్బంది తప్పనిసరిగా మొక్కల సంరక్షణ బాధ్యతలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఎన్ ఉషా , పరీక్షల నియంత్రణ అధికారి డా. పి వీర బ్రహ్మచారి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. స్వరూపా, డా. శేషా రెడ్డి, డా. శాంతి కపా, డా. రవి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కాల్వలోకి దూసుకెళ్లిన కారు



ప్రజాశక్తి-కోడూరు : ఇటీవల నూతనంగా పునర్ నిర్మిస్తున్న కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిపై వరుసగా ప్రమాదాలు జరుగు తున్నాయి. గురువారం అవనిగడ్డ నుంచి కోడూరు వస్తున్న కారు కష్ణాపురం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి కాలువలోకి దూసుకు వెళ్ళింది. కాలువలో నీరు లేని కారణంగా ఎటువంటి ప్రాణహాని జరగలేదు. తటిలో ప్రమాదం తప్పిందని వాహనదారులు తమ వాహనాలను పరిమితికి మించి తోలడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని కష్ణాపురం గ్రామ ప్రజలు చెప్తున్నారు.

హోంగార్డు అనుమానాస్పద మృతి



ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలం స్థానిక నటరాజ్ థియేటర్ వెనుక హోంగారు లేళ్ళరవిబాబు సీలింగ్ ఫ్యాన్ కి ఉరేసుకొని ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. మతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మతుడు కత్తివెన్ను మండలం చిన్న పాండ్రాక ఓఎన్జిసిలో హెూంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఏవియేషన్ మేనేజర్ వీరేంద్ర ప్రసాద్ వారి సౌజన్యంతో గాంధీ బొమ్మ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మొక్కలను ప్రజలకు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కె.వి.ఆర్ కిషోర్‌కు 15 మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మడుపల్లి బాలకష్ణమూర్తి, కార్యదర్శి కర్రా వరప్రసాద్, సహాయ కార్యదర్శి వీసం ప్రసాదరావు, ఈసీ నెంబరు వి.వి.కష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సచార్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : దేశంలో మైనారిటీల అభివద్ధికి సచార్ కమిటీ సూచించిన సిఫార్సులు ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని ముస్లిం సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి సదురుద్దీన్ ఖురేషి విజ్ఞప్తి చేశారు. చేతి వత్తులు చేసుకుని జీవనం సాగిస్తున్న మైనారిటీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికి హామీ రహిత రుణాలు మంజూరు చేసి కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు చేయాలన్నారు. మైనారిటీల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల విషయంలో మాటలు కోటలు దాటుతున్నాయి గాని ఆచరణలో శూన్యంగా ఉందన్నారు. ఎంతోమంది పేద ముస్లిం మైనారిటీ కుటుంబాలు తమ పిల్లలను చదివించుకోలేక, బోలెడన్ని ఫీజులు చెల్లించుకోలేక మెకానిక్ షెడ్లో చేతివత్తుల కోసం పంపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన పీ ఫోర్ పథకంలో బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయడంలో ముస్లింలకు కూడా ప్రాధాన్యత కల్పించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మజ్జిగ పంపిణి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద యువ చైతన్య ఎన్విరాన్మెంటల్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, సత్యనారాయణపురంలోని రెడ్డి సింహాచలం ఆర్చి రోడ్లో నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ కిడ్స్ ప్లే స్కూల్, గుడివాడ నాగమల్లేశ్వరరావు నాన్న వీరులు జ్ఞాపకర్థం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుడివాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ గుడివాడ రాజశేఖర్, ట్రాఫిక్ ఏఎస్ఐ శంకర్‌లు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాదాసు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించాలి

భ్రమరాంబపురం పర్యటనలో కాశీనాథ్



భ్రమరాంబపురం వాసులతో మాట్లాడుతున్న కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణలంక 22వ డివిజన్ భ్రమరాంబపురంలో గత 40 ఏళ్లుగా సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన ప్రజా పోరాటాల ఫలితంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేయడానికి విడుదలైన జిఓ నెంబర్ 107 ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి దానిని వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. తూర్పు సిటీ కమిటీ సభ్యులు పి.కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, స్థానిక నేతలతో కలిసి కాశీనాథ్ భ్రమరాంబపురం ప్రాంతంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ ప్రజాపోరాటాల వలనే స్థానిక సమస్యలను పరిష్కరించుకోగలమన్నారు. గడిచిన నాలుగు దశాబ్దాల పాటు ప్రజల తరుపున సిపిఎం నికరంగా నిలబడి పోరాడిందని గుర్తు చేశారు. ప్రజాపోరాటాలకు తలొగ్గి ఆనాటి వైసిపి ప్రభుత్వం గతేడాది మార్చిలో 107 జీఓను విడుదల చేయక తప్పలేదన్నారు. అయితే దానిని అమలు చేయించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, వారికి సిపిఎం అండగా నిలుస్తుందని అన్నారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్, స్థానిక తహశీల్దార్, ఇతర అధికారులను కలిసి వెంటనే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి వీలయినంత త్వరగా పూర్తి చేయాలని కోరామన్నారు. అధికారులు కూడా వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని హామీనిచ్చారన్నారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు పట్టించుకోకపోవడం ఈ ప్రాంత ప్రజల పట్ల ఆయనకున్న చిత్త శుద్ధిని విధితం చేస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం ఇప్పటికే అధికారులకు వచ్చిన 600 దరఖాస్తులను అధికారులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలినవి కూడా వీలయినంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాయల లక్ష్మణ, తూభాటి తాండవ కృష్ణ, కొమ్మూరి ఆనంద్, ఎస్.బాపనయ్య, ఎ.శివ పాల్గొన్నారు.



ప్లాస్టిక్‌ను నివారిద్దాం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: స్థానిక 50వ డివిజన్ సర్దార్ మరుపిళ్ళ చిట్టి ఎలిమెంటరి స్కూల్ పరిధిలో ఉన్న చేపలమార్కెట్, మహంతిపురం అంగన్‌వాడీ కేంద్రంలో ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హజరైన తల్లులందరికీ ప్లాస్టిక్ కాలుష్యం ప్రభావాలు, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నయ వాడకం గురించి తోటి మహిళలకు, వారి కుటుంబాలలో అవగాహన కల్పించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు నిషేధించి జ్యూట్ బ్యాగులను వాడాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాలుష్య నివారణకు ఇంటి ఆవరణలో మొక్కలను పెంచాలని పేర్కొన్నారు. అనంతరం తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈవికె విజయలక్ష్మి, బి అప్పలరాజు, బి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: నిమ్రా హాస్పిటల్ ఆధ్వర్యంలో కొటికలపూడి గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు గురువారం



నిర్వహించారు. ఉచిత మెడికల్ క్యాంపుకు స్థానికుల నుండి విశేష స్పందన లభించింది. వైస్ ఎంపీపీ బండి నాగమణి ఉచిత మెడికల్ క్యాంపును సందర్శించారు. గ్రామ సర్పంచ్ రెంటపల్లి నాగరాజు ఉచిత మెడికల్ క్యాంపులో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. గ్రామాలలో నివసించే సామాన్య ప్రజలకు సైతం ఆధునిక వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న నిమ్రా హాస్పిటల్ వారికి అభినందనలు తెలిపారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపులో పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి అతి తక్కువ ఖర్చుతో నిమ్రా హాస్పిటల్లో వైద్యం అందజేస్తామని, ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఉంగుటూరు సబ్ స్టేషన్ ఏరియాలో ఉంగుటూరు సెక్షన్ పరిధిలో ఉంగుటూరు ఫీడర్ లైనుల మరమ్మతుల నిమిత్తము ఉంగుటూరు, కొయ్యగూరపాడు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ్డడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి బి శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఉన్నతాధికారులను కలిసిన ఉపకులపతి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ గురువారం ఆమరావతి సచివాలయంలో పలువురు ఉన్నతాధికారులను కలిసారు. ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్ ను కలిసి విశ్వవిద్యాలయం లో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించిన విషయాన్ని ఆయన దష్టికి తీసుకెళ్లి, విశ్వవిద్యాలయ అభివద్ధికి సహకారాన్ని అందించాలని కోరారు. ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ ను కలిసి బడ్జెట్ లో నిధుల కేటాయింపు ను మరింత పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ మేరకు ఇరువురు సానుకూలంగా స్పందినట్లు ఉపకులపతి ఆచార్య కె రాంజీ చెప్పారు.



స్కేటింగ్ క్రీడాకారుడికి అభినందన



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

తైవాన్‌లో మార్చి 25వ తేదీ నుంచి 30 వరకు జరిగిన అంతర్జాతీయ ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్-2025లో నాలుగు బంగారు, ఒక వెండి పతకం సాధించిన కొప్పరపు కైవల్యను విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అభినందించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ లో గురువారం ఎంపి కేశినేని శివనాథ్ ను కొప్పరపు కైవల్య మర్యాదపూర్వకంగా కలిశారు. యూత్ కేటగరిలో పోటీపడిన తను ఫ్రీ స్టైల్ , ఇన్ లైన్, సోలో డ్యాన్స్, పెయిర్ స్కేటింగ్ లో బంగారు పతకాలు సాధించగా, కపుల్ డ్యాన్స్ లో వెండి పతకం సొంతం చేసుకున్నట్లు ఎంపి కేశినేని శివనాథ్ కి కైవల్య వివరించారు. తను సాధించిన పతకాలు ఎంపి కేశినేని శివనాథ్ కి చూపించారు. ప్రపంచ క్రీడా వేదిక పై సత్తా చాటి రాష్ట్ర ఖ్యాతి ఇనుమడింప చేసిన కైవల్యను ఆదర్శంగా తీసుకుని క్రీడాల్లో రాణించాలని యువతకు ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. అలాగే జూలై నెలలో సౌత్ కొరియాలో జరగబోయే ఏషియన్ ఛాంపియన్ షిప్ లో పాల్గొనబోతున్న కైవల్య తన మెరుగైన ప్రతిభతో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కైవల్య తండ్రి శశికుమార్ పాల్గొన్నారు.



పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఐదు వేల రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం జరిగిందని కర్లపాటి ట్రస్ట్ చైర్మన్ సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పట్టణంలోని ట్రస్ట్ కార్యాలయంలో చిన్నారులతో పాటు ఐదుగురు వయోవృద్ధులకు నిత్యావసర వస్తువుల్ని అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టూరి నరసింహారావు, శ్రేయస్సు సంస్థ ప్రతినిధులు విజయ కుమారి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టిబిపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండలంలోని మల్లేల గ్రామంలో టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ వ్యాధి గురించి ప్రజలకు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. టిబి వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రెండు వారాలు మించి కళ్లెతో కూడిన దగ్గు ఉన్నట్లయితే గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్లి కళ్లె పరీక్ష చేయించుకోవాల టీబి సూపర్వైజర్ దినీప్ తెలిపారు. ఈకార్యక్రమంలో 104 సిబ్బందితో పాటు ఎఎన్ఎం కనకదుర్గబాయ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి జగ్గయ్యపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సమగ్ర శిక్షా మరియు ఎ పి సిఓఎస్టి వారి సహకారంతో విజయవాడ రీజినల్ సైన్స్ సెంటర్ లో నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో జగ్గయ్యపేట కు చెందిన పలువురు విద్యార్థులు ప్రథమ బహుమతులు సాధించారు. స్థానిక బాలికొన్నత పాఠశాల కు చెందిన చందా అక్షయ, నాగి శ్యామశ్రీ, విజ్ఞాన్ పాఠశాలకు చెందిన వై. తేజస్విని, తపోవనం పాఠశాలకు చెందిన చెరుకూరు సాహితి జిల్లా విద్యా శాఖధికారి యూ. వి. సుబ్బారావు, ఎ పి సిఓఎస్టి విజయవాడ రీజినల్ సైన్స్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ జి. శరత్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఏం. హుస్సేన్ చేతుల మీదుగా ఈ బహుమతులు అందుకున్నారు. బాలికొన్నత పాఠశాల



భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు ఇండ్ల వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే.హేమా మాధవి అభినందించారు.

రసవత్తరంగా చదరంగ పోటీలు

ఒకేసారి వంద మందితో తలపడిన గ్రాండ్ మాస్టర్ తేజస్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: స్కాట్స్‌పైన్ స్కూల్, ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న చదరంగం క్రీడా సంబరాలు గురువారం అత్యంత రసవత్తంగా సాగాయి. రాష్ట్రంలోని వంద క్రీడాకారులను గ్రాండ్ మాస్టర్‌లుగా తీర్చిదిద్దేందుకు నిర్వహించిన ఉచిత గ్రాండ్ మాస్టర్ శిక్షణ కార్యక్రమాన్ని విజయవాడ శివారు కానూరులోని స్కాట్స్‌పైన్ స్కూల్‌లో ఈ నెల రెండో తేదీన ప్రారంభించారు. రాష్ట్ర క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ఇండియా 11వ గ్రాండ్ మాస్టర్ తేజస్ బక్రి(గుజరాత్) ఒకే సారి 100 మంది క్రీడాకారులతో చదరంగం క్రీడలో పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్విరామంగా ఈ పోటీ కొనసాగింది. టాప్ రేటింగ్ క్రీడాకారులు కొల్ల భావన్(ఎన్టీఆర్ జిల్లా), కె.సందీప్(కష్ణాజిల్లా), సి.హెచ్.అనయ్య(రాజమండ్రి), వి.హర్షవర్ధన్(నంద్యాల)తో పాటు 1600 నుంచి 1800 లోపు రేటింగ్ ఉన్న క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొనటంతో పోటీ హోరాహోరీగా సాగింది. భవిషత్తులో ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తా ఉన్న చదరంగం క్రీడాకారులు చాలా మంది వస్తారని గ్రాండ్‌మాస్టర్ తేజస్ బక్రి తెలిపారు. పోటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదు రోజుల పాటు నిర్వహించే గ్రాండ్ మాస్టర్ ఉచిత కోచింగ్‌లో క్రీడాకారుల చురుకుదనం తనకు పరిచయమైందన్నారు. వీరితో పోటీ పడుతున్నపుడు ఒక్కో క్రీడాకారుడు తెలివైన ఎత్తులు వేస్తున్నట్లు చెప్పారు. తనతో పోటీ పడి గెలిచిన క్రీడాకారులకు స్కాట్స్‌పైన్ స్కూల్ ఉచిత సీటును ప్రకటించిందని, దీంతో క్రీడాకారులు తనపై గెలిచేందుకు చాలా కష్టపడ్డారన్నారు. ఇలాంటి కార్యక్రమం, పోటీలు నిర్వహించడం దేశంలోనే తొలిసారి అన్నారు. నైపుణ్యం ఉన్న చెస్ క్రీడాకారులను తయారు చేసేందుకు వినూత్న పద్ధతులను అవలంభిస్తున్న ఆంధ్రా చెస్ అసోసియేషన్‌ను, సహకరిస్తున్న స్కాట్స్ పైన్ స్కూల్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ





సమావేశంలో స్కూల్ ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి సాయిపావని, ఆంధ్రా చెస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.ఎం.ఫణికుమార్ పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌లో ఆకట్టుకున్న కళాకృతులు

- ప్రత్యేక ఆకర్షణగా యాంటీ డ్రోన్ సిస్టం వాహనం



యాంటీ డ్రోన్ సిస్టం వాహనం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మన ఊరు పండుగ.మనందరి పండగ నినాదంతో గురువారం నుండి 8 తేదీ వరకు మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరం వద్ద నిర్వహిస్తున్న మసులా బీచ్ ఫెస్ట్ -2025 లో ఒక విశిష్ట అతిథి వాహనం (యాంటీ డ్రోన్ సిస్టం) కొలువు తీరింది. యాంటీ డ్రోన్ సిస్టంను పర్యాటకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. యాంటీ డ్రోన్ సిస్టం పనితీరును తెలుసుకొని ఆశ్చర్య చకితులు అవుతున్నారు. ఆపరేషన్ సింధూర్ విజయంలో మన మచిలీపట్నం పేరు సగర్వంగా నిలపటంలో బెల్ కంపెనీ తోడ్పాటు ఉందని తెలుసుకుని గర్వంగా ఫీల్ అవుతు న్నారు. ఆపరేషన్ సింధూర్ లో భాగంగా యాంటీ డ్రోన్ సిస్టం మన దేశ సరిహద్దుల్లో మోహరింపజేశారు. ఈ యాంటి డ్రోన్ సిస్టం మన దేశ సైనికుల అమ్ములపొదిలో కీలక అస్త్రమై తన ప్రతాపాన్ని చూపాయి. ఆపరేషన్ సింధూర్ దెబ్బకు పాకిస్తాన్ దేశం కకావికలమై మన దేశ సరిహద్దు లోని సైనిక స్థావరాలు, గ్రామాలు, జనవాసాలపై డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న సమయంలో మన మచిలీపట్నం బెల్ రూపొందించిన యాంటీ డ్రోన్ సిస్టం వాటిని సమర్ధవంతంగా నేల కూల్చటంతో మన సైనికులు పై చేయి సాధించటంలో తోడ్పాటు ను అందించాయి. మచిలీపట్నం బెల్ తయారుచేసిన యాంటీ డ్రోన్ సిస్టంలో ఉపయోగించిన పరికరాలు బెంగుళూరు, హైదరాబాదు, పూణేలలోని బెల్ యూనిట్ల నుండి తీసుకువచ్చి తుది రూపు ఇచ్చారు. వాటి పనితీరును పలు దశల్లో పరీక్షించి నూటికి నూరు శాతం సమర్ధత చూపే విధంగా సిద్ధం చేశారు. తుది పరీక్షల అనంతరం 23 యాంటీ డ్రోన్ సిస్టం లను మచిలీపట్నం బెల్ కంపెనీ వారు సైనిక దళానికి అందజేశారు. వాటిని సైనికులు మన దేశ సరిహద్దుల్లో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. మచిలీపట్నం బెల్ యూనిట్లో వరల్డ్ క్లాస్ లెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఉండగా. నిమ్మలూరు బెల్ యూనిట్‌లో యాంటి డ్రోన్ సిస్టం లు తయారు చేస్తున్నారు. మచిలీపట్నం ఖ్యాతి దేశమంతా మార్మోగిపోవటంలో బెల్ కంపెనీ ఉద్యోగుల కృషి ఎంతో ఉందని అని పర్యాటకులు గొప్పగా ఫీలవు తున్నారు.



ఆకట్టుకున్న కళాకృతులు : సముద్ర జీవ జాతుల కళాకృతులు పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. వాటి వద్ద ఫొటోలు దిగేందుకు ఫెస్టివల్‌కు వచ్చిన పర్యాటకులు ఆసక్తి చూపారు.



బీచ్ ఫెస్టివల్లో అడ్వెంచర్స్ పారా గ్లైడింగ్

మసులా బీచ్ ఫెస్టివల్ ప్రారంభమైన మొదటి రోజు పారా గ్లైడింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫెస్టివల్కు వస్తున్న పర్యాటకులు తమ పిల్లలతో పారా రైడింగ్ చేయడానికి పోటీ పడుతున్నారు. పారా రైడింగ్ను అడ్వెంచర్ స్పోర్ట్స్ గా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. పారా రైడింగ్కు ఒకొక్క రికి రూ. 2వేలు వసూళ్లు చేస్తున్నారు. రెండవరోజు శు క్రవారం నుండి హేలీ రైడింగ్ నిర్వహించనున్నారు.



వివిధ రకాల కళాకృతులు

నేటి నుంచి డోకిపర్రు వెంకటేశ్వరాలయ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు గ్రామంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ దశమ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు తెలిపారు. తొలుత స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ, విశేష నైవేద్యం, అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం వార్షికోత్సవాల అంకుర్పాణ చేస్తారు. 108నదుల నుంచి తెచ్చిన జలాలతో స్వామివారికి 108కలశాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు కష్ణారెడ్డి, సుధారెడ్డి చెప్పారు.

పిచ్చేశ్వరరావుకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఎండూరు పిచ్చేశ్వరరావు మార్కెట్ యార్డ్ నెంబర్‌గా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అభినందించారు. హనుమంతపురం గ్రామానికి చెందిన ఎండూరు పిచ్చేశ్వరరావు మార్కెట్ నెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేయడంపట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు కందిమల్ల సుబ్రహ్మణ్యం, రాజులపాటి రామాంజనేయులు, మండల టిడిపి నాయకులు రాజులపాటి శ్రీనివాసరావు, లింగమ నేని బాబురావు, వీరాంకిలాకులకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.



సాంకేతికతతో వ్యవసాయంలో ముందుకెళ్లాలి



మాట్లా డుతున్న కేవీకే సమన్వయకర్త సుధారాణి

ప్రజాశక్తి-ఉయ్యూరు : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ ద్వారా అతితక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా నోడల్ అధికారి, కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి అన్నారు. వికసిత్ కషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రామకష్ణరిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో గురువారం వ్యవ సాయ శాస్త్రవేత్తలతో ఇష్టాగోష్టి నిర్వహించి రైతులతో సమావేశం నిర్వహించారు. సార్వా పంటకు అనువైన వరి రకాలు, ఆరోగ్యవంతమైన నారు పెంచడానికి తగు సూచన లు శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి తెలియజేశారు. ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ, భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశం జ్యోతి రమణి వివరించారు. గన్నవరం ఏడీఏ సునీల్, కళ్యాణ్ బాబు, ఏవో నిస్సీగ్రేస్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులకు 'విజయక్రాంతి' విద్యార్థులు ఎంపిక



విద్యార్థినీలను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. చల్లపల్లిలోని విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం సిఈసి పరీక్ష రాసి ఉత్తమ ఫలితాలు సాధించిన మట్టా శ్రీవల్లీ, పొట్లూరి త్రివేణి, కాగిత భార్గవిలు ఉత్తమ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం కరస్పాండెంట్ దుట్టా శివరామ ప్రసాద్ ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు వారు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మా కళాశాల విద్యార్థులను ప్రతిభా అవార్డులకు ఎంపిక చేయటం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ నెల 9వ తేదీన మచిలీపట్నంలో జరిగే జిల్లా స్థాయి కార్యక్రమంలో విద్యార్థులు అవార్డులు అందుకుంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థినులకు మదర్ థెరీసా, స్వామి వివేకానంద చిత్రపటాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రోల్‌బాల్ ఇంటర్నేషనల్ పోటీలకు మోటపర్తి శ్రీశాంత్ ఎంపిక



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రోల్‌బాల్ ఇంటర్నేషనల్ పోటీల్లో తలపడేందుకు గుడ్లవల్లేరు మండలం లోని వడ్లమన్నాడు శివారు కొండిపా లానికి చెందిన మోటపర్తి శ్రీశాంత్ ఎంపికయ్యాడు. ఏపీ, తెలంగాణా తెలుగు రాష్ట్రాల తరఫున తమ కుమారుడు శ్రీశాంత్ ఎంపిక కావటంతో తమకెంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు రాంబాబు, చైతన్య గురువారం తెలిపారు. జనవరిలో కర్నూల్‌లో జరిగిన నేషనల్ లెవల్ పోటీల్లో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన జరిగే ఇంటర్నేష నల్ ఇంటర్నేషనల్ లెవల్ పోటీలకు తమ కుమారుడు గురువారమే బయలుదేరినట్లు పేర్కొన్నారు. గతంలో శ్రీశాంత్ స్టేట్ లెవల్‌లో అనేక పతకాలు, కప్‌లు సాధించినట్లు చెప్పారు. ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికైన శ్రీశాంత్‌ను గ్రామ ప్రముఖులు కేశన మహేష్, మన్నెం వీరయ్య, పామర్తి హరిబాబు, పండే హరిబాబు అభినందించారు.



మొవ్వ ఎఎంసి చైర్మన్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దోనెపూడి శివరామయ్య గురువారం కూచిపూడి, పెదపూడి సెంటర్లో శాంతి కాంప్లెక్స్‌లో మార్కెట్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులు తో పాటు పాలక వర్గ సభ్యులు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రమాణ స్వీకారం చేయిం చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలం మంజు లూరు గ్రామంలో పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సబ్సిడీపై వరి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో వరి విత్తనాలు సబ్సి డీపై అందిస్తున్నట్లు, కేజీకి ఐదు రూపాయలు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్నట్లు వ్యవసాయశాకాధికారులు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవ కేంద్రాలను సంప్రదించాలన్నారు.

నెట్టెం రఘురాంకు అభినందనలు

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన నెట్టెం రఘురామ్‌ను డీసీఎంఎస్ చైర్మన్ మచిలీ పట్నం జనసేన ఇంచార్జ్ బండి రామకష్ణ గురువారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అభినందన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అభినందన సభలో పాల్గొని ప్రసంగించారు. మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు కందుల ఫణి, కోన ఏడుకొండలు పాల్గొన్నారు

మంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : రాష్ట్ర పర్యాటక శాఖ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కు గురువారం సాయంత్రం మచిలీపట్నం బైపాస్ రోడ్డు మూడు స్తంభాల సెంటర్ వద్ద మచిలీపట్నం జనసేన పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మసాలా బీచ్ ఫెస్టివల్ పాల్గొన్నందుకు వచ్చిన రాష్ట్ర మంత్రికి జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకష్ణ ఎదురేగి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను బహుకరించారు. జనసేన నాయకులు గడ్డంరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.







ఇబ్రహీంపట్నంలో...

మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్రపదేశ్‌ను తయారుచేయడమే ముఖ్యమంత్రి ఉద్దేశన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 55,607 అంగన్వాడి సెంటర్లకు మొదటి దశగా 11400 అంగన్వాడి సెంటర్లకు ఇండక్షన్ స్టవ్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ స్టవ్‌లు కాలుష్య రహితమే కాకుండా పిల్లలకు వీటి వలన ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా సురక్షితమైన పద్ధతిలో తయారు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి-విజయవాడ: హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది వనమనోహత్సవం సందర్భంగా 2.60 లక్షల మొక్కలు నాటాలన్న సంకల్పంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, పచ్చదనంతో కళకళలాడుతూ జిల్లాకు బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆధ్వర్యంలో నగరంలోని సత్యనారాయణపురంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని గురువారం కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. ర్యాలీలో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఈఈ పి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, సేఫ్ ఎన్విరాన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వన్ ఎర్త్-వన్ లైఫ్ ప్రతినిధి ఏలూరి లీలా కుమారి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశతో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు. సెంట్రల్ నియోజకవర్గం 61వ డివిజన్ పాత పాయకాపురం చెరువు పార్కులో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒహెచ్ డాక్టర్ బాబు శ్రీనివాస్, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ 71వ సచివాలయం పరిధిలో డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సోమరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు. **ఎడ్యుకేషన్:** విజయవాడలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 3న నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందచేసినట్లు ప్రిన్సిపాల్ డా. మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు.



పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మలబారు గోల్డ్ అండ్ డైమండ్స్ సౌజన్యంతో కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వేమూరి బాబూరావు, సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా..ఎం. రమేష్, సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ప్లేస్ మెంట్ అధికారి డా. కె. శ్రీధర్, గ్రీన్ క్లబ్ ఇన్ చార్జి దాసరి శ్రావణి, మలబార్ మేనేజర్ మహమ్మద్ ఖాసిం పాల్గొన్నారు. **మైలవరం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, ఎంపీపీ లక్ష్మీ ప్రసన్న రాణి, సర్పంచి మంజు భార్గవి పాల్గొన్నారు. **విజయవాడ సిటీ:** 44వ డివిజన్లోని గంజి ఎల్లమందయ్య వీధిలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైలవరపు దుర్గారావు, స్పెషల్ ఆఫీసర్ మురళి గౌడ్ పాల్గొన్నారు. **తిరువూరు:** ప్రపంచ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు తిరువూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ప్రాణికీ ప్రాణవా యువు చెట్లేనని న్యాయమూర్తి సింధూర తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల వెంకటరెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఎస్.జనార్ధనరావు, ఏం.నాగేంద్రప్రసాద్, ఎన్.రామకష్ణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పోతుల చెరువు వద్ద రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి, చైర్ పర్సన్ నిర్మల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరి రక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.లక్ష్మీ, కమిషనర్ జి.లోవరాజు పాల్గొన్నారు. **నందిగామ:** చందాపురం గ్రామంలో ఆశా వర్కర్లు మొక్కలు నాటారు. **కంచికచర్ల:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మీ కుమారి, ఎంఈఓ బి బాలాజీ, ఏపీఓ రమాదేవి సిబ్బంది పాల్గొన్నారు. కంచికచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వేల్పుల సునీత, కార్యదర్శి సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. **ఇబ్రహీంపట్నం:** మొక్కలు నాటడం, చెట్లు పెంచడం పై ప్రతిజ్ఞ చేయించారు. తదనంతరం ర్యాలీగా వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమ్య కీర్తన, చుట్టుకుదురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **వీరులపాడు:** జుజ్జూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కార్యదర్శి మీర్జావలి, రామావత్ కోటి ఊరు చెరువు కట్టపై మొక్కలు నాటారు. **జగ్గయ్యపేట:** పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ చిల్డ్రన్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రఘువేంద్ర రంగపురం, వార్డు కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, నకిరకంటి వెంకట్, గొట్టే నాగరాజు, పేరం సైదేశ్వర రావు, కాటగాని నరసింహారావు, పూసల పుల్లారావు, గోగుల సీతారాములు పాల్గొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట తహశీల్దార్ మనోహర్, రామకృష్ణ పాల్గొన్నారు. తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ఆలయ సహాయ కమిషనర్ ఎం.కె. టి.ఎన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నరేష్ వెంకటేశ్వర రావు, శ్రీనివాసరావు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో...



వీరులపాడులో...



జగ్గయ్యపేటలో...





మైలవరంలో...



ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మసుల బీచ్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా జాతీయస్థాయి కబడి పోటీలను మంత్రులు కందుల దుర్గేష్ కొల్లు రవీంద్ర లు గురువారం లాంఛనంగా ప్రారంభించారు మొదటిరోజు జరిగిన పోటీలలో తెలంగాణపై ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించింది. నేషనల్ బీచ్ కబడ్డీ పురుషుల విభాగంలో 23 రాష్ట్రాల నుంచి జట్లు రాగా స్త్రీల విభాగంలో 22 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. కబడ్డీ పురుషుల విభాగంలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ జట్లు పోటీ పడక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం జట్టు 22 పాయింట్లు తో విజయం సాధించింది.అలాగే కర్ణాటక ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన పోటీలో ఉత్తరాఖండ్ 21 పాయింట్లు తో గెలుపొందింది. హర్యానా జార?ండ్ జట్ల మధ్య జరిగిన పోటీలో హర్యానా 41 పాయింట్లతో విజేతగా నిలిచింది.స్త్రీల విభాగంలో పంజాబ్ పాండిచ్చేరి జట్ల మధ్య జరిగిన పోటీలో పంజాబ్ 33 పాయింట్లతో గెలుపొందింది. తమిళనాడు ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన పోటీలో 04 పాయింట్లతో తమిళనాడు జట్టు విజయంసాధించగా , కర్ణాటక రాజస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో రాజస్థాన్ 43 పాయింట్లతో విజయం సాధించింది.



జీవితంలో యోగా భాగమవ్వాలి

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టీఆర్ జిల్లాను ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేయిచేయి కలుపుదామని.. దీంతో స్వర్ణాంధ్ర సాకారానికి మంచి పునాదులు పడతాయని, జీవితానికి యోగా తోడైతే అంతా ఆనందమేనని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.గురువారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ఆయుష్ శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు, యోగా ఔత్సాహికులు తదితరులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శరీరంలో కొత్త ఉత్సాహాన్ని నింపే యోగాసనాలను ప్రతిఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యానికి యోగాసనాల అభ్యసన ఎంత ముఖ్యమో పర్యవరణానికి మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి సంస్థలో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఈఈ పి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, వన్ ఎర్త్-వన్ లైఫ్ ప్రతినిధులు ఏలూరి లీలా కుమారి పాల్గొన్నారు.

వస్త్ర దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : నేటి పోటీ ప్రపంచంలో నాణ్యమైన వస్త్రాలు ప్రజలకు అందజేసి పోలుకొండ సుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి) వ్యాపారంలో అభివృద్ధి చెందాలని జనసేన నాయకులు సందు పవన్ అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ది ఇన్నర్స్ జోన్ వస్త్ర దుకాణాన్ని జనసేన నాయకులు సందు పవన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ నిరసనలు



చల్లపల్లి మండలంలో...

ప్రజాశక్తి మోపిదేవి (చల్లపల్లి) : కార్మిక హక్కులపై దాడి చేస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు బాటలో రాష్ట్రప్రభుత్వం నడుస్తూ పని గంటల పెంపు ఉత్తర్వులు జారీ చేసి కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేసిందని మండల సిఐటియు కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను వ్యతిరేకిస్తూ స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ కరీముల్లా మాట్లాడుతూ కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను ఒక్కసారిగా కాల రాసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి రాష్ట్ర ప్రజలు అధికారం కట్టబెట్టి ఏడాది అయినా సందర్భంగా కార్మికులకు మంచి బహుమతి ఇచ్చిందని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే విధంగా సవరణలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరిముల్లా, మండల కమిటీ సభ్యులు కొమ్ముకూరి రాజేశ్వరరావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో 8 గంటల పని 10 గంటలకు పెంచుతూ నిర్ణయం చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎనిమిది గంటల కోసం పోరాటాలు చేసిన కార్మికులు ఇప్పటికే 8 గంటల పని 9 గంటల వరకు అనేక సంస్థల్లో, అనేక రంగాల్లో పనిచేయిస్తున్నారన్నారు. మంత్రి వర్గం 10 గంటలకి తీసుకుపోవడం అంటే ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయ్ గంజి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా ఉత్సాహాలు నిర్వహించి ఈ రాష్ట్రంలో కార్మికులకు పనిగంటలు పెంచుతూ చేసిన మంత్రివర్గ తీర్మానం ఈ ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తుందో స్పష్టంగా అర్థమైందని సిపిఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లో పయనిస్తూ రాష్ట్రంలో కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ప్రస్తుతం అమలులో ఉన్న పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటలకు పెంచటం కార్మికుల శ్రమను పిండి కార్పొరేట్లకు అప్పచెప్పటమే అని అన్నారు. రాత్రివేళ షిఫ్టుల్లో కూడా మహిళలు పనిచేసేటట్లు నిర్ణయాలను తీసుకోవడం మహిళ కార్మికుల పట్ల ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, పని గంటల పెంపుకు వ్యతిరేకంగా జులై 9 వ తేదీన జరిగే సమ్మెలో కార్మిక వర్గం పాల్గొనాలని కోరారు.



విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో సుపరిపాలన మొదలై ఏడాది వేడుకలు పురస్కరించుకొని గాంధీ క్షేత్రంలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. బుధవారం నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ బహుమతులు అందజేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు. కుర్చీలాట. టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి విజేతకు తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్న) రూ 3 నగదు బహుమతి అందచేయగా ద్వితీయ తతీయ విజేతలకు రైస్ కుక్కర్లో అందజేశారు. టగ్ ఆఫ్ వార్ పోటీలలో మొదటి ద్వితీయ విజేతలకు కుక్కర్లో అందజేయగా కుర్చీలాట విజేత జట్టుకు ఆ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మాజీ ఎంపీపీ బం డే కనకదుర్గ ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కష్ణకుమారి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నపరెడ్డి వెంకటస్వామి, కూనప రెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కళ్యాణమస్తు అందజేత

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటశాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘంలో పాల ఉత్పత్తిదారులు కొల్లూరి శ్రీనివాసరావు కుమారుడు హికిలేష్ వివాహం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రవేశపెట్టిన "కళ్యాణమస్తు అందజేశారు. దీనిద్వాఆరా రూ.20 వేల విలువగల బంగారు నాణెమును కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకట రమణ, సంఘ అధ్యక్షులు గొర్రెపాటి సురేష్ గురువారం వధూవరులకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ గోపీనాథ్, రూటు సూపర్వైజర్ తమ్మన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ దరఖాస్తులు ఆన్‌లైన్

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని ఉపాధ్యాయుల బదిలీల కొరకు 81 మంది గ్రేడ్ 2 స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జిటి ఉపాధ్యాయుల బదిలీ దరఖాస్తులను యుటిఎఫ్ కంకిపాడు శాఖ ఆధ్వర్యంలో ఆన్లైన్ చేశారు. 63 మంది హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ లకు వెబ్ ఆప్షన్స్ నమోదు చేశారని యుటిఎఫ్ కంకిపాడు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బుచ్చయ్య బాబు, శ్రీనివాసరావులు తెలిపారు. ఆన్లైన్ చేసిన కార్యదర్శులు వినయ్, మురళి, అంబూజీ, ఫణింద్ర, మూర్తి, సుధాకర్, జోగిరాజులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

మహిళలకు నైట్ డ్యూటీల నిర్ణయంపై ఆగ్రహం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మహిళ కార్మికుల చేత నైట్ డ్యూటీలు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని శ్రామిక మహిళా కృష్ణా జిల్లా కన్వీనర్ ధనశ్రీ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత పేరుతో మహిళలతో నైట్ డ్యూటీలు చేయించాలని నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనకకు తీసుకోవాలన్నారు. పట్టపగలే మహిళలకు సమాజంలో రక్షణ లేకుండా పోతున్న ఈరోజుల్లో మహిళా కార్మికుల భద్రతను ప్రభుత్వం మరింత అగమ్యగోచరంగా మారుస్తుందన్నారు. మహిళలపై అత్యాచారాలు హత్యలు, దాడులు విపరీతంగా పెరిగిపోతున్న ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం చేయటం దుర్మార్గం అన్నారు. మచిలీపట్నం శ్రామిక మహిళ నాయకురాలు అంగత రమాదేవి పాల్గొన్నారు

పుస్తక పఠనంతో మేలు

ప్రజాశక్తి-గన్నవరం : పుస్తక పఠనంతో మీరు జరుగుతుందని రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ పడమట రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం గ్రేడ్ వన్ గ్రంథాలయంలో పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రేడ్ 1 గ్రంథాలయంలో పిల్లలను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాల నిర్వహించడం పట్ల సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిమట రామారావు, గ్రంథాలయ అధికారి జ్యోతి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గ పరిధిలోని రైతాంగానికి మంచి చేసేందుకు అధికారులు, నీటి సంఘాలు అందరం కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో ఇరిగేషన్&డ్రైనేజీ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు నియోజకవర్గ వ్యాప్తంగా కాలువల్లో జరుగుతున్న అభివద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన ఎమ్మెల్యే రాము అధికారుల వివరణతో సంతప్తి వ్యక్తం చేశారు. ఒకటి రెండు చోట్ల కాంట్రాక్టర్ల నిర్లక్ష్యాన్ని గుర్తించి మందకొడిగా పనులు చేస్తే ఊరుకోనని కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ఆలస్యం అయితే వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టేందుకు కూడా వెనుకాడనని అధికారులతో అన్నారు. ఈ సందర్భంగా డిసి చైర్మన్లు తీసుకొచ్చిన కొన్ని సమస్యలను అధికారులకు తెలిపారు. నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీజన్ ప్రారంభానికి ముందే కాలువలు, డ్రైన్లలో సమస్యల పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డి.ఈ భరత్, డ్రైనేజీ డి.ఈ గణపతి, డి.సి చైర్మన్లు యార్లగడ్డ రవి, బొమ్మనబోయిన ఏసుబాబు పాల్గొన్నారు.

ముగిసిన నడకుదురు ఆలయ రాజగోపుర తృతీయ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-మోపిదేవి (చల్లపల్లి) : ప్రాచీన శైవక్షేత్రం నడకుదురు శ్రీపద్వీశ్వర క్షేత్రానికి భవిష్యత్తులో గొప్ప వైభవం వస్తుందని ద్విసహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. గురువారం చల్లపల్లి మండలం నడకుదురు గ్రామంలోని మహిమాన్విత శైవక్షేత్రం, నడకుదురు శ్రీపృధ్వీశ్వరస్వామి ఆలయ రాజగోపుర తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉదయం గణపతిపూజ, గవ్యాంతర ప్రధాన కుంభ ఆవాహన, మహన్యాసం, 108 కలశాలతో అభిషేకం, శ్రీరుద్రసహిత పరివార దేవతల మంత్ర హవనములు, ఏకాదశ రుద్రాభిషేకం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సమగ్ర అభివద్ధి దాత మండవ రవీంద్ర - రమణకుమారి దంపతులు, వారి కుమార్తె.. అల్లుడు డాక్టర్ యార్లగడ్డ మధుకిరణ్ డాక్టర్ సింధూర దంపతులు పూజా కార్యక్రమాలు చేశారు. ద్విసహస్రావధాని పద్మశ్రీ డా.మాడుగుల



నాగఫణిశర్మ ముఖ్య అతిధిగా పాల్గొని మహాపూర్ణాహుతిలో పాల్గొని హెూమంలో ద్రవ్యములు సమర్పించారు. అర్చకులు కంఠంరాజు సాయిబాబుశర్మ (గణపతి దీక్షితులు) ఆధ్వర్యంలో వేదపండితులు, పురోహితులు, అర్చకులు పూజా కార్యక్రమాలు జరిపారు. ప్రముఖులు అనంత్, నాదెళ్ల ప్రభాకరరావు, మల్లుపెద్ది త్రివిక్రమరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, యార్లగడ్డ శ్రీనివాసరావు, డాక్టర్ పి.మనోజ్, నాదెళ్ల శివరామకష్ణ, గొరిపర్తి రమేష్, ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరంలో శ్రీ సీతారామచంద్ర ఆలయ, విగ్రహాల ప్రతిష్ట మహెూత్సవాలను శుక్ర, శనివారాలు నిర్వహించనున్నామని నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, హెూమాలు, విశేషాభిషేకాలను నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిష్టకు విచ్చేసి భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి స్వర్గీయ వడ్లమూడి రమేష్‌బాబు స్మారకార్థం దాత వడ్లమూడి సరోజిని (యూఎస్‌ఏ) రూ.35లక్షలను విరాళంగా అందించినట్లు చెప్పారు.

కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ అందించాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ప్రతి కౌలు రైతుకి అందించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి వి లక్ష్మణస్వామి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు కౌలు రైతుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి మాట్లాడుతూ మండలంలో 80 శాతం వ్యవసాయ భూమి కౌలు రైతులు సాగు చేస్తున్నారని, కౌలు గుర్తింపు కార్డుకు భూ యజమాని అనుమతి కావాలి అనే నిబంధన కారణంగా మండలంలో 10 శాతం మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు అందుతున్నాయని అన్నారు. పలితంగా అత్యధిక వడ్డీకి ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు తీసుకుని వ్యవసాయం సాగు చేయటం కష్టంగా మారిందని అన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు షేక్ సలీం, బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీరా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం భూయజమాని సంతకంతో సంబంధం కౌలు రైతులందరికీ ఇవ్వాలని కోరుతూ కంకిపాడు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కంకిపాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అదించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం కంకిపాడు మండల నాయకులు తాడంకి. నరేష్, కౌలు రైతులసంఘం నాయకులు చిక్కవరపు శ్రీహరి, గెడ్డం రాజా, పచ్చిగళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరు మండలంలో...



కంకిపాడు మండలంలో...

పని గంటల పెంపు దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచడాన్ని నిరసిస్తూ విజయవాడ బీసెంట్ రోడ్‌లో సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనేపూడి.కాశీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్మిక సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలును రాష్ట్రంలో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని కోసం పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమన్నారు. కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేట్లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే చంద్రబాబు, కూటమి ప్రభుత్వం వ్యవరిస్తుందని అన్నారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి జరుగుతున్న కాలంలో ఎఐ విస్తరించి మానవ శ్రమను తగ్గిస్తున్న ఆధునిక యుగంలో పని గంటలు తగ్గించాల్సింది పోయి పెంచడం దారుణమన్నారు. కనీస వేతనాలు అమలు చేయలేని ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు చేయడం సిగ్గుచేటన్నారు. పని గంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుపోతే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు కలుపుకుని ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే.దుర్గారావు, నారాయణ, సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, విజయవాడ సెంట్రల్ సిటీ సిఐటియు నాయకులు ఏం.బాబురావు, లక్ష్మణ్, షాప్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కార్యదర్శి వై.సుబ్బారావు, కొండా, సిఐటియు తూర్పు సిటీ నాయకులు ఎన్.నాగేశ్వరావు, పి.కృష్ణ, గురుమూర్తి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కార్మికుల 8 గంటల పని దినాన్ని 10 గంటలకు మార్చడాన్ని, ఓవర్ టైమ్ పని గంటలు పెంచడాన్ని, మహిళలు 24 గంటలు పని చేయాలని నిర్ణయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం చేసిన కార్మిక వ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కొండపల్లి ఐడిఏ హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్రక్ టెర్మినల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి కార్మికులను కట్టు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

బానిసలుగా మార్చిన పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఎనిమిది గంటల పని దినాన్ని పది గంటల పని దినాలుగా మార్చి, కార్మికులను మరింత కట్టు బానిసలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క మహిళలకి పని ప్రదేశాల్లో సరైన భద్రత కల్పించలేని పాలక ప్రభుత్వాలు, యాజమాన్యాలు 24 గంటలు మహిళలు పనిచేయాలని నిర్ణయించడం తగదన్నారు. రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్, హెచ్‌పిసిఎల్ ట్రక్ టెర్మినల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి రాజశేఖర్, ఉపాధ్యక్షులు చెన్నారావు, కోశాధికారి పిచ్చయ్య, డ్రైవర్ యూనియన్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ సుందర్రావు, సెక్రెటరీ శేషాగిరి, ఉపాధ్యక్షులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: 50వ డివిజన్‌లో రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ బి.సత్యబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లపాలెం గట్టు, మహంతిపురం ప్రాంతాలలో మురుగు నీటి పారుదల వ్యవస్థతో పాటు వర్షపు నీరు ప్రవాహం సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలం లో డివిజన్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ దష్టి కి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ సమస్య పై కమిషనర్ సానుకూలంగా స్పందించి సుమారు రూ.13 లక్షల నిధులను విడుదల చేసిన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా మహంతిపురం జడపాపయ్య వీధిలో 13 లక్షల వ్యయంతో రోడ్డుని ర్మాణ పనులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ శ్రీనివాస్, స్థానిక డివిజన్ అభివృద్ధి కమిటీ నాయకులు పి.రాజు, స్థానిక పెద్దలు దుర్గమ్మ, కంప గంగాధర్ ప్రసాదు, రాజు,,ఏ శ్రీను. వి ఎస్కే హుస్సేన్ ఎండి వజీర్. హరి ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థి విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధుల పుస్తకాలను చదివించి చెప్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డివిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. **కంచికచర్ల:** కంచికచర్ల గ్రంథాలయ లో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. గురువారం మాస్టర్ ఎం కనకారావు చెస్ ఆటలో మెళుకువల గురించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. ఆంటీ పాటలు, డాన్సులు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు పాల్గొన్నారు.



దుర్గగుడి హుండీల ఆదాయం రూ.4.11 కోట్లు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. దేవస్థానంలోని మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో ఆలయ కార్యనిర్వాహణాధికారి శీనానాయక్ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 22 రోజులకు రూ.4,11,96,190, బంగారం 394 గ్రాములు, 8.010 గ్రాముల వెండి రూపంలో లభించాయని ఈవో వెల్లడించారు. దుర్గమ్మను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గురువారం వేర్వేరుగా దర్శించుకున్నారు. మంత్రులకు ఆలయ ఈవో వీకే శీనానాయక్ స్వాగతం పలికారు.



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మైలవరం: మండలంలోని పుల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం ఏజీయల్ ఫీడర్, వెల్వడం సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్డబ్ల్యూఎస్ ఫీడర్ మీద ట్రీ కటింగ్ విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఆయా సబ్ స్టేషన్‌ల ఏఈలు గార్లపాటి రమేష్ బాబు, సిహెచ్ రామ్మోహన్రావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పుల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో పుల్లూరు, దాసులపాలెం, కొత్తగూడెం, గ్రామానికి ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, వెల్వడం సబ్ స్టేషన్ పరిధిలోని తోలుకోడు గ్రామానికి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

హామీలన్నీ అమలు చేయాలి : పుణ్యశీల



ప్రజాశక్తి-విజయవాడ: సూపర్ సిక్స్ పేరుతో మహిళలు, రైతులు, నిరుద్యోగ యువకులు ఇలా ప్రతి ఒక్కరినీ కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైసిపి కార్పొరేటర్, ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకులు బండి నాగేంద్రపుణ్యశీల పేర్కొన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎంతో నమ్మి సిఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి ఓటు వేసిన ప్రజలను అన్ని విధాలుగా దగా చేశారని దుయ్యబట్టారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలన్నింటినీ ఎత్తేశారన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలు, శాంతిభద్రతలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. అబద్ధపు హామీలతో అందరినీ వంచించావని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకను నొక్కేయడానికి రెడ్ బుక్‌తో టెర్రర్ సృష్టిస్తున్నామని విమర్శించారు. కుట్రలు ఆపి సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల తరుపున వైసిపి నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు.

సీతారావమ్మకు నివాళి



ప్రజాశక్తి-తిరువూరు: సిపిఎం తిరువూరు రూరల్ కార్యదర్శి రాచబంటి నరసింహారావు తల్లి సీతారావమ్మ (90) రోలుపడి శివారు సురవరంలోని చిన్న కుమారుడు బుజ్జి నివాసంలో గురువారం మృతిచెందారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారుడు ఉన్నారు. మూడో కుమారుడు నరసింహారావు సిపిఎం మండల కార్యదర్శిగా కొనసాగుతున్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు బి.ఆర్.తులసీరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం, ఎస్వీ.భద్రం, సాంబారు వెంకటేశ్వర్లు, ఎం.చింతయ్య, ఏ.రవి, టీ.కృష్ణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు బండి రవి, న్యాయవాది వాకదాని లక్ష్మీనారాయణ తదితరులు సీతారావమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు అధ్య క్షతన జరిగిన సంతాప సభలో తులసీరావు మాట్లాడుతూ సీతారావమ్మ, భర్త వెంకటరామయ్యలు రోలుపడి ప్రాంతంలో నిర్వహించే ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలిచేవారని చెప్పారు. ఇంటి కొచ్చిన పార్టీ కార్యకర్తలను భోజనం చేయకుండా పంపేవారు కాదని, తల్లిదండ్రుల స్ఫూర్తితో కుటుంబ సభ్యులు పార్టీ పట్ల విధేయులుగా ఉన్నారని తెలిపారు.

కౌలు రైతులకు కార్డులివ్వాలి

ప్రజాశక్తి-వత్సవాయి: కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.హనుమంతరావు డిమాండ్ చేవారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు, జనార్ధనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం మిర్చి పంటలకు గిట్టుబాటు ధరలు లేక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల ప్రభుత్వం నుండి వచ్చే సబ్సిడిలు, పంట నష్టపరిహారం కౌలురైతులకు అందడం లేదని, భూ యజమానితో సంబంధం లేకుండా కార్డులివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం అధ్యక్షులు


వినతిపత్రం ఇస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

కె.కోటయ్య, వై.వెంకటరత్నం, బి.పులయ్య, వై.బుల్లబాయి, కె.ప్రసాద్ సీఐటీయు మండల కార్యదర్శి బి.రాము తదితరులు పాల్గొన్నారు.



7న బక్రీద్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈదుల్ అజ్హా నమాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న బక్రీద్ నమాజ్ మహా ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సంప్రదాయం ప్రకారం జరుగుతుందని ఈద్గా కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ మునీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా నమాజ్‌కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నమాజ్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఉదయం 7:30 గంటలకు ఈద్ నమాజ్ ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎండి ఇర్ఫాన్, ఎండి అన్వర్ పాషా, షేక్ వలి, మఖ్బూల్ అహ్మద్ నద్వి, ముక్తార్ ఆలీ, సయ్యద్ అలీ పాల్గొన్నారు.

యోగా శిక్షణ

ప్రజాశక్తి-వత్సవాయి

పెనుగంచిప్రోలు మండలంలోని ఉపాధ్యాయులకు గురువారం పెనుగంచిప్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, రమణ, బాబు ప్రసాద్, మోహన లక్ష్మీ పాల్గొన్నారు.